## మూగరాగాలు

ఇరుగు పొరుగు ఇళ్ళల్లో కాపురాలు వుంటున్న ఇందిరా పద్మజల కలసికట్టుతనాన్ని చూసినవాళ్లు 'ఇరుగు పొరుగు అంటే ఇలా వుండాలి' అనుకోకుండా వుండలేరు.

ఇందిరకు రకరకాల కుట్లు, అల్లికలు వచ్చు. పద్మజ వీణ వాయించడంలో సిద్ధహస్తురాలు. వాళ్ల స్నేహబంధంలో ఆరు నెలలయ్యేసరికి పద్మజకు అన్ని కుట్లు, అల్లికలు వచ్చేశాయి. ఇందిరకు వీణా వాద్యంలో ప్రావీణ్యం అలవడింది.

మరి అంతటి సాన్నిహత్యం వారిద్దరిది. అంతేకాదు, తెల్లవారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయేలోపల వాళ్లు ఎన్నిసార్లు కలుసుకుంటారో, ఎన్నెన్ని కబుర్లు చెప్పుకుంటారో లెక్కించలేము.

భర్తలు ఆఫీసులకు వెళ్లేకైతే ఓ యింటి కెప్పుడూ తాళం వేసే వుంటుంది. వాళ్ల స్నేహానికి ప్రకృతి కూడా పులకించిందేమో ఇద్దరికీ ఒకేసారి మాతృత్వాన్ని ప్రసాదించింది. ఇంకో చిత్రం: ఇద్దరికీ అమ్మాయిలే. ఒకేసారి పురిటికి పుట్టింటికి వెళ్లి పండంటి పసిపాపలతో ఒకేసారి తిరిగి వచ్చేరు.

ఇద్దరూ కలుసుకున్నాక ఇద్దరికీ నచ్చినపేర్లనే ఆ చిన్నారులకు పెట్టుకున్నారు.

వాళ్లిద్దరి మైత్రిబంధం కన్నా, స్వర్ణా సువర్ణల బోసినవ్వుల చెలిమి యింకా గొప్పది. ఆ చిలిపి కళ్ల పలకరింపులో తొణికిసలాడే స్నేహం సాటిలేనిది. ఒక్కొక్కప్పుడు ఇందిరా పద్మజల శ్రీవార్లు ఆ ఇద్దరిలో తమ బిడ్డ ఎవరో పోల్చుకోవడానికి కాస్త తికమక పడాల్సివస్తుంది. ఎందుకంటే ఒకే రకం గౌన్లు తొడిగి, ఒకేమాదిరి ముస్తాబు చెయ్యడం ఆ తల్లులకు అదొక వేడుక.

ఆ చిన్నారులిద్దరూ తరచుగా ఒకే ఇంట్లో వుంటారు. వాళ్లతో ఎక్కువ పరిచయం లేని వాళ్లు ఇద్దరూ ఒకే తల్లి బిడ్డలని, కవలలని పొరబాటుపడుతుంటారు.

నెలలు గడుస్తున్నకొద్దీ ఆ పాపాయిల చిలిపి చేతలు ఆ తల్లులను మురిపిస్తున్న కొద్దీ ఇందిరా, పద్మజలకు ఎన్నెన్నో ముచ్చట్లు.

ఆ స్నేహ క్షీరఘటంలో వున్నపాటున ఉప్పురవ్వ పడింది. ఫలితంగా తియ్యని, కమ్మని ఆ పాలు విరిగిపోయాయి. ఏ రుచీ లేకుండా చప్పబడిపోయాయి.

ఇప్పుడు ఇందిర పద్మజ ముఖం చూడదు.

ఇందిర యెదురైతే తటాలున తలుపేసుకుంటుంది పద్మజ.

ఇంతకీ ఆ పాలల్లో పడిన ఉప్పురవ్వ ఏమంత ఘనమైందికాదు. సిల్లీ నాన్సెన్స్.

పద్మజ దగ్గర పావుకిలో పంచదార బదులు తీసుకుంది ఇందిర. ఇవ్వటం మరచిపోయి యిచ్చేశా ననుకుంది. బదులు తీర్చమని పద్మజ అడిగినప్పుడు ఆమెతో అలాగే అంది.

'పావుకిలో పంచదార కోసం పోట్లాడడం కాదు గానీ... నువ్వు బదులు తీర్చలేదు.'

'కావాలంటే పూర్తిగా ఒక కిలో పంచదార ఇచ్చేస్తానుగానీ... నేను నీ బదులు తీర్చేశాను.'

ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగింది. చిలికి చిలికి గాలివాన అయింది.

ఆ గాలివానలో దృఢంగా అల్లుకున్న వాళ్ళ స్నేహపు పందిరి కూలిపోయింది.

అలా వారం రోజులు గడిచిపోయాయి.

ఇందిర పాపాయిని ఊరడిస్తోంది.

'ఏమిటి ఇందూ! ఎప్పుడూ లేనిది పాప ఇలా చికాకు చేస్తోందే!' అడిగాడు భర్త.

'ఏమోనండీ. ఐదారు రోజులనుండి ఇలా చంపుకుతింటోంది. ఒకటే ఏడుపు. పోనీ జ్వరమా అంటే అదేంకాదు. ఆకలేమో అనుకుంటే పాలు త్రాగేసి కూడా ఇలానే ఏడుస్తోంది."

భర్తకు బదులు చెప్పేసి మళ్లీ పాపాయిని సముదాయించడంలో మునిగిపోయింది ఇందిర.

సరిగ్గా అదే సమయానికి పద్మజ అదే స్థితిలో వుంది. పొద్దస్తమానం పాప ఏడుపు మానకపోవడం ఆమెను భయభ్రాంతురాలిని చేసింది.

పద్మజ భర్తతో అంది "ఇదేం మాయదారి రోగమోనండి, ఇలా ఏడుస్తోంది."

ఆ మాటకతను "సాయంత్రం రెడీగావుండు, పాపని హాస్పిటల్‌కు తీసుకువెళదాము" అన్నాడు.

అనుకున్నట్లే హాస్పిటల్‌కు వెళ్లేరు. పాపని పరీక్షించిన డాక్టరుగారు ఆశ్చర్యపోయాడు.

'ఏ రోగమూ లేదు. కారణం నాకూ అంతుపట్టడంలేదు. ఆరోగ్యంగావున్న ఈ పాపకు ఏమందులని యివ్వనూ?' అనేశాడు.

నిరాశగా అడుగులేసుకుంటూ యింటి ముఖం పట్టిన ఆ దంపతులకు దారిలో ఎదురైంది ఇందిర. భర్తతో పాపతో సహా.

ఇందిరా, పద్మజలు ముఖాలు చాటు చేసుకొనేలోగా వాళ్ల చేతుల్లోని పాపాయిలు ఒకరిపై మరొకరు ఉరికినంత పనిచేశారు. ఫకాలున నవ్వుకుంటూ నవ్వేసుకుంటూ పలకరించుకున్నారు. ఆ పసిపాపల ముఖాలలో విరిసిన ఆ పసిడికాంతులు ఎవరికీ వర్ణింప శక్యంకాదు. చూసిన ఆ తల్లులకు అర్థమైంది తమ బిడ్డలు ఎందుకోసం ఇలా తల్లడిల్లిందీ.

"ఇంక హాస్పిటల్‌కు వెళ్లక్కర్లేదండి. ఇంటికి వెళ్లిపోదాం పదండి" తన పాపను పద్మజ చేతికి అందించి ఆమె చేతుల్లోని పాపను తను తీసుకుంటూ అంది ఇందిర.

ప్రేమగా ఇందిర పాప నెత్తుకున్న పద్మజ స్నేహపూర్వకంగా ఆమె చేయి పట్టుకుంది. ఆ పసికూనల మూగరాగాలు వాళ్ల తప్పిదాన్ని తెల్పి ఆ తల్లుల హృదయాలను మళ్లీ కలిపేశాయి.

●